
ఆంధ్రజ్యోతి

జయశంకర్ భూపాలపల్లి ములుగు

5

ఆదివారం 7 జనవరి 2024



పనితీరు మెరుగుపర్చుకోవాలి : డీఎంహెచ్‌వో

మల్హర్, జనవరి 6 : తాడిచర్ల ప్రభుత్వాస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పనితీరును మెరుగుపర్చుకోవాలని డీఎంహెచ్‌వో మధుసూదన్ అన్నారు. మండల కేంద్రమైన తాడిచర్లలోని ప్రభుత్వాస్పత్రితో పాటు వల్లెంకుంట, మల్లారం, ఎడ్లపల్లి సబ్ సెంటర్‌ల ను శనివారం సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. తాడిచర్లలో ఆస్పత్రి ఆవరణంలో సాగుతున్న వైద్యాధికారి భవనం, తాడిచర్ల సబ్ సెంటర్-1 పనులను పరిశీలించారు. త్వరితగతిన నాణ్యతగా నిర్మాణం చేపట్టాలని డీఎంహెచ్‌వో సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చింతలపల్లి మల్హల్‌రావు, వైద్యాధికారి రాజు తదితరులు పాల్గొన్నారు.

హరివిల్లును తలపించిన రంగవల్లులు

- ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీకి విశేష స్పందన
- జిల్లా నలుమూలల నుంచి తరలొచ్చిన మహిళామణులు
- పోటీలను తిలకించిన పలువురు జిల్లా అధికారులు
- విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన ఎమ్మెల్యే



భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో ముగ్గులు వేస్తున్న మహిళలు, యువతులు

కృష్ణకాలనీ(భూపాలపల్లి)/భూపాలపల్లిటౌన్, జనవరి 6 : తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు మహిళల్లో ముగ్గులపై ఆసక్తి పెంచేందుకు 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' యేటా నిర్వహిస్తున్న ముత్యాల ముగ్గుల పోటీల్లో భాగంగా శనివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో ముగ్గుల పోటీ నిర్వహించింది. ఈ పోటీకి జిల్లా నలుమూలల నుంచి భారీగా మహిళలు తరలివచ్చారు. రంగులతో, ఆడపడచుల సందడితో స్టేడియం కళకళలాడింది. ముత్యాల ముగ్గుల ముగ్గుకు విశేష స్పందన లభించింది.

పాల్గొన్న 154 మంది మహిళలు

ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి మహిళలు యువతులు 154 మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉదయం 8 గంటలకే స్టేడియంకు చేరుకొని పేర్లు నమోదు చేసుకున్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంతో పాటు కాటారం, మహదేవపూర్, మహాముత్తారం, చిట్యాల, రేగొండ, గణపురం మండలాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు తరలివచ్చారు. అంతేకాకుండా హనుమకొండ జిల్లా పరకాల, కరీంనగర్ జిల్లా హుజురాబాద్ నుంచి మహిళలు పోటీల్లో పాల్గొనేందుకు వచ్చారు. వివిధ రంగులు, చుక్కలతో ముగ్గులను వేసి అలరించారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని సంప్రదాయాలు ఉట్టి పడేలా, పల్లెటూరి వాతావరణాన్ని సంతరించుకునేలా గొబ్బెమ్మలు, పూలు, పండ్లు, పిండి వంటకాలతో వేసిన ముగ్గులు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధుల సందర్శన

ముత్యాల ముగ్గుల పోటీలను పలువురు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు సందర్శించారు. తొలుత జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అదనపు ఎస్పీ నరేష్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత, భూపాలపల్లి పట్టణ సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సై శ్రీలత, పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు కిరణ్‌కుమార్, లక్ష్మీప్రసన్నతో పాటు పలువురు అధికారులు ముగ్గులను చూసి మంత్రముగ్ధులయ్యారు. అనంతరం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో పాటు కౌన్సిలర్లు దాట్ల శ్రీనివాస్, ముంజాల రవిందర్, చల్ల రేణుక, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అయిత ప్రకాష్‌రెడ్డి, నాయకులు ఇస్లావత్ దేవన్, క్యాతరాజు సాంబమూర్తి, పిప్పాల రాజేందర్, ఉడుత మహేందర్, రంజిత్, విజయ్ తదితరులు ముగ్గులను పరిశీలించారు. ముగ్గులు వేసిన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన ఉపాధ్యాయులు ఎ.రజిత, ఎం.లావణ్య ముగ్గులను పరిశీలించారు. 154 మంది వేసిన ముగ్గులను పరిశీలించి మార్కులను వేశారు. చుక్కల ముగ్గు, రంగులు, సంస్కృతి, సంప్రదాయాలను పరిగణలోనికి తీసుకొని ముగ్గులు వేసిన వారిలో విజేతలుగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అయిత ప్రకాష్‌రెడ్డి, కౌన్సిలర్లు దాట్ల శ్రీనివాస్, ముంజాల రవిందర్, చల్ల రేణుక, కాంగ్రెస్ నాయకులు ఇస్లావత్ దేవన్, క్యాతరాజు సాంబమూర్తి, కురిమిళ్ల శ్రీనివాస్, పిప్పాల రాజేందర్, ఉడుత మహేందర్, బౌతు విజయ్‌కుమార్, తోట రంజిత్ అనిల్‌తో పాటు ఏబీఎన్-ఆంధ్రజ్యోతి వరంగల్ ఇన్‌చార్జి నవీన్, ఆంధ్రజ్యోతి భూపాలపల్లి ఆర్సీ ఇన్‌చార్జి మంతెన సమ్మయ్య, దావు రాంరెడ్డి, వైనాల మహేందర్, ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ పాలకుర్తి మధు, చేని శ్రీనివాస్, వనం విజయ్‌కుమార్, బొమ్మనబోయిన పృథ్వీరాజ్, కొమురోజు రమేష్, జాగిరి అశోక్‌యాదవ్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



ముగ్గు వేస్తున్న యువతి

సంప్రదాయాలు ఉట్టి పడేలా సంబరాలు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

సంప్రదాయాలు ఉట్టి పడేలా ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు ఉన్నాయని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ముత్యాల ముగ్గుల పోటీల విజేతలకు బహుమతుల ప్రదానోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముగ్గులను పరిశీలించి ఆనందం వ్యక్తం చేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందించిన అనంతరం మాట్లాడారు. పోటీల్లో గెలిచిన వారు రాష్ట్ర స్థాయిలో రాణించాలని, ఓటమి చెందిన వారు నిరుత్సాహ పడకుండా మరోమారు ప్రయత్నం చేయాలన్నారు. కనుమరుగైపోతున్న మన సంస్కృతిని కాపాడేందుకు ఏబీఎన్-ఆంధ్రజ్యోతి చేస్తున్న కృషి వెలకట్టలేనిదన్నారు.



మొదటి బహుమతి విజేత వేసిన ముగ్గు, విజేత ఈర్ల లావణ్య



రెండో బహుమతి గెలుచుకున్న ముగ్గు, విజేత బోయిని రమాదేవి



మూడో బహుమతి కైవసం చేసుకున్న ముగ్గు, విజేత పూదరి శైలజ

విజేతలకు బహుమతులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



విజేతకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, ప్రముఖ వైద్యులు

ముగ్గుల పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు బహుమతులను అందించారు. ప్రథమ బహుమతి భూపాలపల్లి పట్టణంలోని కృష్ణకాలనీకి చెందిన ఈర్ల లావణ్య కైవసం చేసుకోగా.. ఆమెకు రూ.6వేల నగదును అందించారు. అలాగే ద్వితీయ స్థానంలో పరకాలకు చెందిన బోయిని రమాదేవి నిలువగా ఆమెకు రూ.4వేల నగదును, తృతీయ స్థానంలో నిలిచిన పట్టణంలోని టీటూ క్వార్టర్స్‌కు చెందిన పూదరి శైలజకు రూ.3వేల నగదును ఎమ్మెల్యే గండ్ర, ప్రముఖ వైద్యులు కేవీఎస్ కిరణ్‌కుమార్, లక్ష్మీప్రసన్నల చేతుల మీదుగా అందించారు. వీరితో పాటు కన్సోలేషన్స్ బహుమతి కింద కృష్ణకాలనీకి చెందిన కె.రమణ, జవహర్‌నగర్ కాలనీకి చెందిన చల్ల రమణలకు మెమెంటోలను బహూకరించారు. అలాగే పోటీల్లో పాల్గొన్న మహిళలకు ఎమ్మెల్యే గండ్ర చీరలను అందజేశారు. ముగ్గుల పోటీల్లో మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్న విషయం తెలుసుకొని ప్రతీ మహిళకు చీరలు బహుమతిగా ఇస్తానని ప్రకటించి అందించారు.

నెలాఖరుకు జాతర ఏర్పాట్లు పూర్తిచేయాలి

- నాణ్యత లోపిస్తే బాధ్యులు ఇంటికే..
- మేడారానికి అదనపు నిధులిస్తాం
- కేంద్రం జాతీయ పండుగ హోదా కల్పించాలి
- రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క
- క్షేత్ర స్థాయిలో పనుల పరిశీలన



మేడారంలో రోడ్డు పనులను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

మేడారం, జనవరి 6 : మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం చేపట్టిన పనులు, ఏర్పాట్లను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. నాణ్యత లోపించినా, సకాలంలో పనులు పూర్తికాకున్నా సంబంధిత అధికారులు ఇంటికేనని హెచ్చరించారు. శనివారం తాడ్వాయి మండలంలోని మేడారంలో పర్యటించిన సీతక్క జాతర ఏర్పాట్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీశ్, ఐటీడీఏ పీవో అంకిత్, అదనపు కలెక్టర్‌లు శ్రీజ, వేణుగోపాల్, ఇతర శాఖల అధికారులతో కలిసి పనులను పరిశీలించిన సీతక్క పలు సూచనలు చేశారు. వనదేవతల గద్దెలను దర్శించుకొని మొక్కులు సమర్పించారు. అనంతరం ఐటీడీఏ అతిథి గృహంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆతర్వాత మీడియాతో మాట్లాడుతూ ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా.. తెలంగాణ కుంభమేళాగా అభివర్ధించే మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరలో భక్తులకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. ప్రస్తుతం విడుదల చేసిన రూ.75 కోట్లకు అదనంగా మరిన్ని నిధులిస్తామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటిసారిగా జాతర నిర్వహిస్తున్న నేపథ్యంలో అత్యంత అంగరంగ వైభవంగా జరిపిస్తామని తెలిపారు. వనదేవతల విశిష్ఠతను ప్రపంచం నలుమూలల తెలియజేస్తామన్నారు. జాతీయ హోదా కోసం రాష్ట్రపతిని కోరడం జరిగిందన్నారు. ఈసారి జాతీయ హోదా లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జాతరను కాలుష్య రహితంగా జరిపించడంలో అధికారులు, భక్తులు సహకరిచాలని కోరారు.

మేడారమంతా కలియదిరుగుతూ..

అధికారులతో కలిసి మేడారం పరిసరాల్లో మంత్రి సీతక్క కలియదిరిగారు. ఆదివాసీ మ్యూజియాన్ని సుందరీకరించాలని అధికారులను ఆదేశించారు. గిరిజన సంప్రదాయాలు, సంస్కృతి, సమ్మక్క, సారలమ్మ దేవతల జీవిత చరిత్రను తెలియజేయడంలో మ్యూజియం కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి అన్నారు. మహా జాతరలో ఎక్కువ మంది భక్తులు సందర్శిస్తారని, వెంటనే పనులు మొదలుపెట్టాలని గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. హరిత హోటల్ మరమ్మతు పనులను త్వరగా చేపట్టాలని సూచించారు. ఇందుకు ప్రభుత్వం రూ.85 లక్షలను మంజూరు చేసిందన్నారు. వీఐపీలు, వీవీఐపీలు వచ్చే రహదారుల పనులు వెంటనే పూర్తి చేయా లన్నారు. ఆర్టీసీ బస్టాండ్, టికెట్ కౌంటర్లు, విశ్రాంతి షెడ్‌లు, తాగునీటి వసతులు, మరుగుదొడ్లు, క్యూలైన్లను పరిశీలించారు.



వనదేవతను దర్శించుకుంటున్న మంత్రి సీతక్క

'బంగారం' సమర్పణకు కన్వేయర్ బెల్ట్

మేడారం వనదేవతలకు భక్తులు బంగారం(బెల్లం) సమర్పించుకొనేందుకు అధికారులు ఆధునిక పద్ధతిలో కన్వేయర్ బెల్ట్‌ను ప్రయోగాత్మకంగా ఈ జాతరలో ఉపయోగించనున్నారు. ఇందుకోసం ప్రణాళికలు సిద్ధం చేశారు. మంత్రి సీతక్క మేడారం పర్యటలో భాగంగా సమ్మక్క సారలమ్మలను దర్శించుకొని గద్దెల ప్రాంగణం, క్యూలైన్లు పరిశీలించారు. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటీడీఏ పీవో అంకిత్, ఎస్పీ శబరీశ్‌లకు దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంతరావు, ఈవో రాజేంద్రం, టెక్నికల్ ఇంజనీరింగ్ అధికారులు ఈ ప్రణాళికను వివరించారు. అనంతరం మంత్రి సీతక్క

మిగతా 8వ పేజీలో...

నేడు ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలు

ములుగులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాట్లు

ములుగు, జనవరి 6 : 'ఆంధ్రజ్యోతి - ఏబీఎన్' ఆధ్వర్యంలో ముత్యాల ముగ్గుల పోటీలను ఆదివారం (7వ తేదీన) నిర్వహించడం జరుగుతోంది. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రతీ ఏటా మహిళామణుల కోసం నిర్వహించే పోటీలను కొనసాగిస్తూ ఈసారి కూడా ఘనంగా జరిపించేందుకు ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాట్లు చేయడం జరిగింది. ప్రథమ విజేతకు రూ.6వేలు, ద్వితీయ విజేతకు రూ.4వేలు, తృతీయ విజేతకు రూ.3వేల నగదును బహుమతిగా అందజేస్తారు. పోటీలలో పాల్గొనే మహిళలు ముగ్గులు, రంగులు, ఇతర వస్తువులను స్వతహాగా సమకూర్చుకోవాల్సి ఉంటుంది. ప్రతిభావంతులకు ప్రోత్సాహక బహుమతులు కూడా ఉంటాయి. వివరాల కోసం 9985411690, 8008929254 నెంబర్‌లలో సంప్రదించగలరు.

త్వరలో మినీ జాతర పనులు ప్రారంభం

పూరేడుగుట్టను సందర్శించిన ఎమ్మెల్యే, కలెక్టర్



వెంచరామి మినీ జాతర ప్రాంతాన్ని సందర్శించిన ఎమ్మెల్యే, కలెక్టర్

చిట్యాల, జనవరి 6 : మండలంలోని వెంచరామి, కాల్వపల్లి శివారు పూరేడుగుట్ట మినీ మేడారం జాతర అభివృద్ధి పనులను త్వరలో ప్రారంభిస్తామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. శనివారం జాతర నిర్వహించే ప్రాంతాన్ని వారు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులతో మాట్లాడారు. వెంచరామి నుంచి జాతర ప్రాంతం మీదుగా కాల్వపల్లి శివారు మానేరు వాగు వరకు తాత్కాలిక రోడ్డు మరమ్మతు పనులు, విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, స్నానాల గదుల ఏర్పాటు తదితర మౌలిక వసతులు కల్పించేందుకు అవసరమైన నిధులను మంజూరి చేస్తామని తెలిపారు. జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామన్నారు. వారం రోజుల్లో సంబంధిత శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ, ప్రజాప్రతినిధులతో మరొకసారి సమీక్ష నిర్వహిస్తామని అన్నారు. మినీ జాతరను వైభవంగా నిర్వహించేట్లు ఏర్పాట్లు చేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టేకుమట్ల జడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, తహసీల్దార్ సుమన్, ఎంపీడీవో రామయ్య, సర్పంచ్‌లు కచ్చు మల్లేష్, ముకిరాల మధువంశీకృష్ణ, ఎంపీవో రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, నాయకులు కొంరయ్య, శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పిడమర్తి రవి

రాష్ట్రంలో రెండు ఎంపీ సీట్లు మాదిగలకు కేటాయించాలి

మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిడమర్తి రవి

హనుమకొండ రూరల్, జనవరి 6: రాష్ట్రంలో ఎక్కువ జనాభా ఉన్న మాదిగలకు అన్ని రాజకీయ పార్టీలు పార్లమెంట్ ఎన్నికల్లో రెండు స్థానాలు కేటాయించాలని మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిడమర్తి రవి డిమాండ్ చేశారు. శనివారం అలంకార్ జంక్షన్‌లోని టీఎన్‌జీవోస్ భవన్‌లో మాదిగ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మైన ఉపేందర్ మాదిగ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పిడమర్తి రవి మాట్లాడుతూ.. మాదిగలను మోసం చేసిన బీజేపీ తరుఫున మంద కృష్ణ వరంగల్ పార్లమెంట్ స్థానానికి పోటీ చేస్తే.. తాను కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తానని అన్నారు. మాదిగ ఉద్యమాన్ని పట్టించుకోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాదిగ జేఏసీ కృషి చేస్తుందని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ పేరుతో మాదిగ, మాదిగ ఉపకులాల ఓట్లను దండుకోవడానికే బీజేపీ తెర లేపిందని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదం తెలపాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాదిగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ కొడారి ధీరన్, బి.వీరేందర్, వి.శోమచంద్రశేఖర్, ఓ.శంకర్, ఎం.ఆరోగ్యం, సంపత్, ఉపేందర్, మధుకర్, అశోక్, రవి, అనిల్, గోపి, రామ్‌కుమార్, శ్రీనివాస్, కిషన్, మోహన్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

హనుమకొండ రూరల్, జనవరి 6: గ్రూప్ 1, 2, 3, 4 ఫౌండేషన్ కోర్సులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ ఎంపివి.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో వచ్చిన మార్కులు, రిజర్వేషన్ ఆధారంగా ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 20వ తేదీలోగా www.tsbcstudycircle.cgg.-gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 0870-2571192, 040-24071178, 040-27077929లో సంప్రదించాలని ఆయన కోరారు.

ఇంజనీరింగ్ అధికారుల చేరిక అదనపు బలం

ఉమ్మడి జిల్లా సమన్వయకర్త జగన్మోహన్‌రావు



సభ్యత్వ రశీదును అందచేస్తున్న జగన్మోహన్‌రావు

హనుమకొండ సిటీ, జనవరి 6: తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్‌లో జీడబ్ల్యూఎంసీ ఇంజనీరింగ్ అధికారులు మిళితం కావడం తమకు అదనపు బలాన్ని ఇచ్చిందని టీజీవో ఉమ్మడి జిల్లా సమన్వయకర్త జగన్మోహన్‌రావు వెల్లడించారు. ఉమ్మడి జిల్లా టీఎస్‌సీపీఎస్‌ఈయూ కన్వీనర్ ఏఈ దొడ్డపాటి హరికుమార్ ఆధ్వర్యంలో టీజీవోలో మిళతం చేసే కార్యక్రమం శనివారం జరిగింది. హనుమకొండ కలెక్టరేట్ ప్రాంగణంలోని టీజీవో కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ముఖ్య అతిథిగా హాజరైన జగన్మోహన్‌రావు మాట్లాడారు. జీడబ్ల్యూఎంసీ ఏఈలు టీజీవో చేరడం అభినందనీయమన్నారు. ఇంజనీరింగ్ అధికారుల సమస్యల పరిష్కారానికి పోరాడుతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బల్దియా ఇంజనీరింగ్ అధికారులు కార్తీక్‌రెడ్డి, ప్రవళి, మిజముల్, సౌజన్య, రాగి శ్రీకాంత్, మేనక, అజ్మీరా శ్రీకాంత్, విజయలక్ష్మి, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఏఆర్ కిష్ణయ్య సస్పెన్షన్

వీసీ రమేశ్ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ సస్పెండ్ ఉత్తర్వులు జారీ



కేయూ క్యాంపస్, జనవరి 6: కాకతీయ యూనివర్సిటీ ఆడిట్ విభాగం అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎస్.కిష్ణయ్యను ఉద్యోగం నుంచి సస్పెండ్ చేస్తూ శనివారం రాత్రి కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 5న శుక్రవా రం కేయూ ఆడిట్ కార్యాలయంలోని ఏఆర్ కిష్ణయ్య తన చాంబర్‌లో వర్సిటీ హాస్టల్స్‌కు పాలు, పెరుగు సరఫరా చేసే కాంట్రాక్టర్ పి.రాజేందర్ నుంచి రూ. 50 వేలు లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు చిక్కాడు, ఈ నేపథ్యంలో శనివారం కిష్ణయ్యను ఏబీసీ కోర్టుకు సంబంధిత పోలీసులు అధికారులు హాజరుపరిచారు. హైదరాబాద్‌లోని ఏసీబీ మేజిస్ట్రేట్ కిష్ణయ్యను 14 రోజుల రిమాండ్‌కు ఆదేశించగా చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఏసీబీ పోలీసుల ఆరెస్ట్, రిమాండ్, ఏసీబీ డీఎస్పీ సమాచారం ఆధారంగా కిష్ణయ్యను శాఖపరమైన చర్యల్లో భాగంగా ఉద్యోగం నుంచి సస్పెండ్ చేస్తూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే తదుపరి చర్యలు కోర్టు ఉత్తర్వుల మేరకు ఉంటాయని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు స్పష్టంచేశారు.

కేయూ ఏఆర్ కిష్ణయ్య ఇంట్లో ఏసీబీ సోదాలు

కేయూలో శుక్రవారం మధ్యాహ్నం ఆడిట్ కార్యాలయంలో లంచం తీసుకుంటూ పట్టుబడిన అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిష్ణయ్య ఇంట్లో శనివారం ఏసీబీ డీఎస్పీ సాంబయ్య నేతృత్వంలో సోదాలు నిర్వహించారు. వర్సిటీలో కిష్ణయ్య ఆఫీస్‌లోనూ పనిచేస్తున్న తోటి ఉద్యోగుల వివరాలు, ఫోన్‌నెంబర్లను సేకరించారు. కిష్ణయ్య ఇంట్లో పెద్ద ఎత్తున బంగారంతో పాటు నగదు, దస్తావేజులు, ఇతర వివరాలను ఏసీబీ పోలీసులు సేకరించారు. కిష్ణయ్య అక్రమ ఆస్తులను గుర్తించినట్లు తెలుస్తోంది. కాగా, కిష్ణయ్యను హైదరాబాద్‌లోని ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

బావిలో దూకి యువతి ఆత్మహత్య

మరిపెడ రూరల్ (మహబూబాబాద్ జిల్లా), జనవరి 6 : అనుమానాస్పదంగా బానోతు చామంతి (18) అనే యువతి వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం మూలమర్రి తండాలో చోటు చేసుకుంది. మృతురాలు తండ్రి శ్రీను, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం. మూలమర్రి తండాకు చెందిన బానోతు శ్రీను-చిలకమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్దకూతురుకి వివాహమైంది. అనారోగ్యంతో మూడేళ్ల క్రితం చిలకమ్మ మృతి చెందింది. రెండో కుమార్తె చామంతి వాల్యాతండాకు చెందిన వాసు అనే యువకుడితో ప్రేమలో పడింది. గత 20 నెలల క్రితం చామంతి, వాసుకు వాగ్వావాదం జరిగింది. దీంతో ఆమె పురుగుల మందు సేవించింది. ఖమ్మంలోనే ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందింది. చామంతి చికిత్సకు సుమారు రూ.3లక్షల ఖర్చు అయింది. ఆ తర్వాత పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీ నిర్వహించి, వాసుకు రూ.4 లక్షలు జరిమానా విధించారు. అయితే ఈమధ్య కాలంలోనే వాసు, చామంతి ఇద్దరూ కలవడం జరిగింది. ఈ నేపథ్యంలో చామంతి, వాసును పెళ్లి చేసుకోమని అంటే వాసు తాను ఇచ్చిన రూ.4 లక్షలు ఇస్తేనే పెళ్లి చేసుకుంటాను అని అంటున్నాడని వారు తెలిపారు. చామంతి తండ్రి శ్రీనుకు కేవలం 15 గుంటల వ్యవసాయ భూమి మాత్రమే ఉంది. ఈ క్రమంలో ఈనెల 2న మండల కేంద్రంలోని ఓ థియేటర్‌లో సినిమా చూసి, తానంచర్లకు వెళ్లి వాసుకు ఫోన్‌చేసి తాను ఆత్మహత్య చేసుకుంటాను అని చెప్పి, మూలమర్రి తండా శివారు రైతు వేదిక వద్ద వ్యవసాయ బావిలో దూకి చామంతి ఆత్మహత్య చేసుకుంది. కాగా, వ్యవసాయ పొలంలో ఉన్న గిరిజనులు శనివారం బావి వద్దకు వెళ్లగా మృతదేహం తేలియాడుతూ కన్పించింది. వెంటనే వారు పోలీసులుకు సమాచారం అందివ్వగా పోలీసులు వెళ్లారు. తండ్రి బానోతు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తహెర్‌బాబా తెలిపారు.



'ట్రాఫిక్'లో వసూళ్ల దందా

తనిఖీల్లో కొందరు అధికారుల చేతివాటం ● డ్రంకెన్ డ్రైవ్ టార్గెట్ పేరుతో అక్రమ సంపాదన ● కొన్ని చోట్ల ప్రయివేటు వ్యక్తులతో దందా

ట్రాఫిక్ విభాగంలో వసూళ్ల పర్వం పెచ్చుమీరిపోతోంది. తనిఖీల పేరుతో వాహనదారుల జేబులు గుల్ల చేస్తున్నారు. కొందరు అధికారులు సంపాదనే ధ్యేయంగా దిగజారుతున్నారు. ముఖ్యంగా డ్రంకెన్ డ్రైవ్ వారికి కాసుల వర్షం కురిపిస్తోంది. ఎవరైనా డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడితే చాలు.. ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారు. అలాగే నెలవారీగా ఇసుక వాహనాలు, క్వారీ, రెడ్‌మిక్స్ తదితర వాటి నుంచి వచ్చే మామూళ్లతో లక్షలకు పడగెత్తుతున్నారు. వాహనదారులను పీల్చి పిప్పి చేస్తున్న కొందరు ట్రాఫిక్ పోలీసులపై సీపీ అంబర్‌కిషోర్ ఝా దృష్టిసారించారు. ఈ నేపథ్యంలోనే యువకుల నుంచి డబ్బులు తీసుకున్న ట్రాఫిక్ ఎస్ఐ డేవిడ్‌ను సస్పెండ్ చేశారు. దీంతో అవినీతి అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

హనుమకొండ క్రైం, జనవరి 6: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని వరంగల్, హనుమకొండ, కాజీపేట ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌ల పరిధిలో కొందరు అధికారుల తీరు పోలీసు శాఖకే మచ్చ తీసుకువస్తోంది. తనిఖీల్లో అక్రమ సంపాదనే ధ్యేయంగా అందినకాడికి దండుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక డ్రంకెన్‌డ్రైవ్‌లో వ్యక్తి దొరికితే చాలు.. ముక్కు పిండి మరీ వసూలు చేస్తున్నారు. సాధారణంగా డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని ప్రయివేటు పార్కింగ్ సెంటర్లలో ఉంచుతారు. నిజానికైతే అక్కడ రోజుకు రూ.10 చార్జి చేయాలి. కానీ పార్కింగ్ యజమానులు వాహనదారుడి నుంచి రోజుకు రూ.30 నుంచి రూ.50 వరకు వసూలు చేసి ట్రాఫిక్ సిబ్బందికి ప్రతీ నెలా మామూళ్ల రూపంలో అప్పగిస్తారనే ప్రచారం ఉంది. ఇక ప్రభుత్వ ఉద్యోగులు పట్టుబడితే రూ.10వేలు ముట్టజెప్పనిదే వదలరు. ఇలా ఇటీవలకాలంలో చాలా మంది ప్రభుత్వ ఉద్యోగులు ట్రాఫిక్ పోలీసులకు తాగి పట్టుబడి డబ్బులు ముట్టజెప్పి మరీ తేలు కుట్టిన దొంగలా కిక్కురుమనకుండా మిన్నకుండిపోయారు.

డ్రంకెన్ డ్రైవ్‌లే ఆదాయంగా..

వరంగల్ పోలీసు కమిషనరేట్‌లోని ఓ పోలీసు పరిధిలో పని చేస్తున్న అధికారికి డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు ఆదాయమార్గంగా ఏర్పడింది. పోలీసు అధికారుల ఆదేశాల మేరకు ప్రతీరోజూ టార్గెట్‌గా చేయాల్సిన డ్రంకెన్‌డ్రైవ్‌ల పేరుతో అందినకాడికి దండుకుంటున్నాడనే విమర్శలు వస్తున్నాయి. తన సర్వీసు ముగింపునకు దగ్గరగా ఉండడంతో ఇదే అదను గా భావించి నాలుగురాళ్లు వెనకేసుకునే పనిలో పడ్డాడు. ఇలా ప్రతీ రోజూ రూ.10వేలకు తక్కువ కాకుండా పలు సెంటర్‌లలో అడ్డాపెట్టి వాహనాల తనిఖీ, డ్రంకెన్‌డ్రైవ్ పేరుతో సంపాదనకు ఎగబడ్డాడు. తన వద్ద ఇద్దరు నమ్మకమైన వ్యక్తులు ఒక ప్రైవేటు డ్రైవర్, ఒక హోంగార్డును వెంటేసుకుని నగర ప్రజలను డబ్బుల కోసం నరకం చూపిస్తున్నాడు.

మందుబాబుల జేబులు గుల్ల

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వ్యక్తులను కోర్టు కానిస్టేబుళ్లతో పాటు సంబంధిత ట్రాఫిక్ పోలీసు అధికారులు అందినకాడికి దండుకుంటారనే ప్రచారం ఉంది. మందుబాబుల జేబుల ను ఓ కోర్టు కానిస్టేబుల్ గుల్ల చేస్తున్నాడనే విమర్శలున్నా యి. ఇలా లక్షలకు పడగెత్తే కానిస్టేబుల్‌. సంబంధిత సీఐ కి నెలకు రూ.1లక్ష లంచం ఇస్తున్నాడంటే ఏమేరకు వసూలు చేస్తున్నారో అర్థమవుతోంది. బాధితులనుంచి రూ.3 వేలకు పైగా వసూలు చేసి సంబంధిత స్టేషన్ అధికారికి పర్సంటేజీ లెక్క ముట్టజెబుతున్నాడు. అయితే పట్టుబడిన వ్యక్తి కోర్టులో చెల్లించాల్సిన డబ్బుల కంటే సదరు కోర్టు కానిస్టేబుల్‌కు చెల్లించే డబ్బే ఎక్కువవుతోందని లబోదిబోమంటున్నారు.

నెలవారి మామూళ్లు

ఇసుక డంపులు, మొరం ట్రాక్టర్లు, ఆటో అడ్డాలు, రెడ్‌మిక్స్ యజమానులనుంచి ఒక్కో ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌కు రూ.5లక్షల వరకు మామూళ్లు వస్తున్నాయనే ప్రచారం జరుగుతోంది. ఇంత జరుగుతుంటే పోలీసులు ఉన్నతాధికారులు ఏం చేస్తున్నారో ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికైనా సీపీ సార్.. జర ట్రాఫిక్ అధికారులపై దృష్టి సారించి సామాన్యులను కాపాడాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ప్రయివేటు వ్యక్తుల హవా

వారు పోలీసు కానిస్టేబుళ్లు కాదు.. హోంగార్డులు అసలే కాదు.. కానీ ద్విచక్రవాహనాలపై ప్రయాణించే వారి వెనకాల పరుగెత్తి మరీ పట్టుకుంటారు.. వాహన యజమాని అనుమతి లేకుండానే బైక్ తాళం లాక్కుని అధికారి వద్దకు తీసుకెళతారు. వారు అనుకున్న ప్రకారం డబ్బులు ముట్టజెబితే వదిలేస్తారు.. లేదంటే వారే డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ చేసి కోర్టుకు వెళ్లేలా చేస్తారు.. ఇటీవల వరంగల్ పోలీసు కమిషనరేట్ ట్రాఫిక్ పోలీసు విభాగంలో ప్రయివేటు వ్యక్తుల విచ్చలవిడితనం పెరిగిపోయింది. ఎస్ఐ, ఆర్ఎస్ఐ, సీఐ స్థాయి అధికారుల వద్ద పని చేస్తున్న ప్రైవేటు వ్యక్తులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. అధికారులకంటే వీరే ఎక్కువ ఫోజులు కొడుతూ రోడ్లపై హల్‌చల్ చేస్తున్నారు. ఇలాంటి వ్యక్తులు ట్రాఫిక్ విభాగంలో చేరి విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల కమిషనరేట్ పరిధిలో చాలా చోట్ల ఇలాంటి ఘటనలు వెలుగుచూస్తున్నాయి.

ట్రాఫిక్ ఎస్ఐ డేవిడ్‌పై వేటు

యువకుల నుంచి డబ్బులు వసూలు చేయడంతో సస్పెన్షన్



హనుమకొండ క్రైం, జనవరి 6: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని హనుమకొండ ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న సిలివేరు డేవిడ్‌ను సీపీ అంబర్ కిశోర్ ఝా సస్పెండ్ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కొందరు యువకుల నుంచి లంచం తీసుకుంటూ అడ్డంగా దొరికిపోవడంతో విచారణ చేపట్టిన సీపీ.. ఎస్ఐ డేవిడ్‌పై సస్పెన్షన్ వేటు వేశారు. వివరాల్లోకి వెళితే..

ఇటీవల హనుమకొండ పెద్దమ్మగడ్డ సమీపంలో ఎస్ఐ డేవిడ్ వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై వస్తుండగా ఆపాడు. వాహన పత్రాలు లేకపోవడంతో విద్యార్థులను ఎస్ఐ డబ్బులు డిమాండ్ చేశారు. దీంతో చేసేదేమీ లేక విద్యార్థులు రూ.500 ఇచ్చి అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే ఈ తతంగాన్ని బాధిత యువకుల స్నేహితులు అక్కడే ఉన్న భవనంపై నుంచి సెల్‌ఫోన్‌లో చిత్రీకరించారు. ఆపై ఎస్ఐ డేవిడ్ డబ్బులు తీసుకుంటున్న వీడియోను కొందరు సోషల్ మీడియాలో పోస్టు చేశారు. మరి కొందరు ఎస్ఐ నిర్వాకాన్ని సీపీ అంబర్ కిశోర్ ఝాకు పంపించారు. దీంతో సీపీ నిఘా వర్గాల ద్వారా విచారణ చేయించారు. నిజమని తేలడంతో శనివారం విధుల నుంచి తొలగించారు.

వివాదాస్పదుడు

ఎస్ఐ డేవిడ్‌కు ఆది నుంచి వివాదాస్పదుడిగా పేరుంది. కానిస్టేబుల్‌గా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించి ఎస్ఐ ర్యాంకర్‌గా పదోన్నతి పొందిన డేవిడ్.. గతంలో వరంగల్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో రెండేళ్లు పనిచేశారు. అక్కడి ప్రజలను, సిబ్బందిని డబ్బుల కోసం ఇబ్బంది పెట్టడంతో అప్పటి సీపీ రంగనాథ్ డేవిడ్‌ను కొడకండ్ల పోలీసుస్టేషన్‌కు బదిలీ చేశారు. అక్కడ సిబ్బందితో గొడవ పడడంతో హనుమకొండ ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌కు బదిలీ చేశారు. ఇక్కడ మూడు మాసాల్లో వాహనదారులను డబ్బుల కోసం ఇబ్బంది పెట్టినట్టు తెలిసింది. దీంతో కొందరు ఎస్ఐ అక్రమాలకు చెక్ పెట్టేందుకు డబ్బులు తీసుకుంటున్న వీడియోను సీపీకి పంపించడంతో విధుల నుంచి తొలగించారు.

టెక్స్‌టైల్ పార్క్ సమస్యలు పరిష్కరించాలి

మడికొండ, జనవరి 6: మడికొండ శివారు టెక్స్‌టైల్ పార్కులో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక టెక్స్‌టైల్ వ్యాపారులు శనివారం రాష్ట్ర టెక్స్‌టైల్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును హైదారాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కొవిడ్ మహమ్మారి టెక్స్‌టైల్ మార్కెట్‌ను తీవ్రంగా ప్రభావితం చేయడంతో బ్యాంక్ చార్జీలు, వడ్డీలు కూడా చెల్లించలేనేని పరిస్థితి నెలకొందన్నారు. బ్యాంక్ వడ్డీలు, చెల్లించడానికి చేతిలో చిల్లి గవ్వకూడా లేదని తెలిపారు ప్రభుత్వం సహకరించి ఫ్యాక్టరీలు సక్రమంగా నడిచి తమ జీవితాల్లో వెలుగులు నింపే విధంగా చర్యలు తీసుకోవాలని ఈ మేరకు వినతి పత్రంలో పేర్కొని మంత్రిని కోరినట్లు మడికొండ టెక్స్‌టైల్ మానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో కూరపాటి విఙ్కుమార్, దగ్గు రవిందర్‌రావు, మామిడి రాజు, మచ్చ వీరన్న, డాక్టర్ వెంకట్‌రాములు, రంగస్వామి, తిరుపతి, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న లారీ

ప్రైవేటు టీచర్ మృతి



హనుమకొండ టౌన్, జనవరి 6: కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చింతల్ భీమారం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయురాలు సునయన(25) మృతి చెందారు. భీమారం సమీపంలోని స్కిల్ స్ట్రోక్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా చేస్తున్న సునయన తోటి ఉపాధ్యాయుడు విశ్వచటర్జీతో కలిసి శనివారం ఉదయం ద్విచక్ర వాహనంపై పాఠశాలకు వెళుతోంది. ఈ క్రమంలో భీమారం పెట్రోల్ బంక్ ముందు హనుమకొండ నుంచి కరీంనగర్ వైపు వెళుతున్న లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ద్విచక్రవాహనం వెనుక కూర్చున్న సునయన లారీ వెనుక చక్రాల కింద పడిపోగా నడుపుతున్న విశ్వచటర్జీ పక్కకు పడిపోయాడు. లారీ చక్రాల కింద పడిపోయిన సునయన నడుము నుంచి కాళ్ల వరకు నుజ్జునుజ్జు అయ్యాయి. విశ్వ చటర్జీకి స్వల్ప గాయాలయ్యాయి. లారీ డ్రైవర్ పరారయ్యాడు.

సమాచారం అందుకున్న కేయూ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పాఠశాల యాజమాన్యానికి సమాచారం అందించారు. తీవ్రగాయాలైన సునయనను చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించగా మెరుగైన వైద్యం అందించేందుకు హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సునయన మృతి చెందింది. ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు. కాగా ముంబయికి చెందిన సునయన రెండేళ్లుగా ప్రైవేటు ఉపాధ్యాయురాలిగా చేస్తూ భీమారం సమీపంలోని బ్యాంక్ కాలనీలో అద్దెకు ఉంటోంది. సునయన మృతి పట్ల పాఠశాల చైర్మన్ తిరుమల్‌రావు, డైరెక్టర్ అనూప్ సంతాపం తెలిపారు.



లారీ చక్రాల కింద సునయన

యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దు

మల్హర్, జనవరి 6: యువత మత్తు పదార్థాలకు బానిసై బంగారు భవిష్యత్‌ను చేజేతుల నాశనం చేసుకోవద్దని కాటారం డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కొయ్యూర్ చౌరస్తాలో విద్యార్థినీ, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. మానవహారంగా ఏర్పడి డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. క్రమశిక్షణతో చదువుకొని తల్లిదండ్రులకు, పుట్టిన ఊరికి పేరు ప్రతిష్ఠలు తీసుకుని రావాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ రంజిత్‌రావు, ఎస్సై నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

వెంకటాపురం(నూగూరు), జనవరి 6: ఏజెన్సీలో విధులు నిర్వర్తిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏజెన్సీ ప్రాంత డిప్యూటీ డీఎంహెచ్‌వో క్రాంతికుమార్ అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. అదే విధంగా రికార్డులు, హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. వైద్యశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, విధుల పట్ల అంకితభావంతో పనిచేయాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ప్రోగ్రాం మేనేజర్, హెల్త్‌సెల్ సూపర్‌వైజర్ ఖలీల్, వైద్యాధికారులు శ్రేష్ఠ, మహేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

సజావుగా సాగిన మండల సభ

గోవిందరావుపేట, జనవరి 6: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం శనివారం సజావుగా కొనసాగింది. ముందుగా వ్యవసాయ శాఖ అధికారి జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ యాసంగి పెట్టుబడి సాయం కింద 2,126 మంది రైతులకు రూ.79.35 లక్షలను జమ చేయడం జరిగిందని అన్నారు. ఎంఈవో గొంది దివాకర్ మాట్లాడుతూ 2023-24 విద్యా సంవత్సరంలో 2,290 మంది విద్యార్థినీ, విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. ఎంపీపీ సూడి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ప్రభుత్వం ద్వారా వస్తున్న పథకాలను పూర్తిస్థాయిలో అందించాలని కోరారు. సమావేశంలో జడ్పీటీసీ తుమ్మల హరిబాబు, ఎంపీటీసీలు గుండెబోయిన నాగలక్ష్మి, చాపల ఉమాదేవి, గోపిదాసు ఏడుకొండలు, లావుడ్యా రాంచందర్, కోఆప్షన్ సభ్యుడు బాబర్, సర్పంచ్‌లు, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, సీడీపీవో మల్లీశ్వరి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హేమాచల క్షేత్రానికి పోటెత్తిన భక్తులు



హేమాచల క్షేత్రం ప్రాంగణంలో మిషన్ భగీరథ ఇంజనీర్లు

మంగపేట, జనవరి 6: మండలంలోని మల్లూరు హేమాచల కొండలపై వెలిసియున్న ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనర్సింహస్వామి క్షేత్రానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఖమ్మం, విజయవాడ, వరంగల్, హనుమకొండ, హైదరాబాద్, కరీంనగర్‌లతో పాటు సుదూర ప్రాంతాల నుంచి సుమారు 12వేల మంది భక్తులు తరలివచ్చి స్వామి వారితో పాటు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు భక్తులకు దైవ దర్శనాలు గావించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అలాగే మిషన్ భగీరథ ఇంజనీర్లు స్వామి వారిని దర్శించుకున్నారు. హేమాచల క్షేత్రం అద్భుతంగా ఉందని మిషన్ భగీరథ సీఈ జి.లలిత అన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నూతలకంటి ముకుందం, అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

వృద్ధులు, వితంతువులకు దుప్పట్లు పంపిణీ

వెంకటాపురం(నూగూరు), జనవరి 6: మండలంలోని టేకులబోరు గ్రామంలో గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో సమకూర్చిన దుప్పట్లు, చీరలను ప్రధానోపాధ్యాయుడు లాలయ్య వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు, గ్రామస్థులు కాల ప్రసాద్, పున్నం ఆంజనేయులు, రాజేష్, గోపి, కుర్సం దూలయ్య, పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

పురుడు పోసిన అంబులెన్స్ సిబ్బంది

తాడ్వాయి, జనవరి 6 : మండలంలోని లింగాల గ్రామానికి చెందిన ఊకె శాలినికి శనివారం పురిటినొప్పులు రావడంతో దగ్గరలోని అంబులెన్స్‌కు కుటుంబసభ్యులు సమాచారం అందించారు. 108 సిబ్బంది ఈఎంటీ శివలింగం ప్రసాద్, పైలట్ కరుణాకర్ సరైన రోడ్డు మార్గంలేని గ్రామానికి చేరుకుని గర్భిణికి ప్రథమ చికిత్స అందించి ములుగు ఏరియా వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలోని పస్రాకు చేరుకునే సరికి పురిటినొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో గమనించిన 108 సిబ్బంది డాక్టర్ గోపీనాథ్ సూచనలు, సలహాలతో సుఖ ప్రసవం చేయగా, శాలిని పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డను గోవిందరావుపేట ప్రాథమిక వైద్యశాలకు తరలించారు. దీంతో శాలిని కుటుంబసభ్యులు అంబులెన్స్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

నాలుగు రోజులు నీటి సరఫరా బంద్

తాడ్వాయి, జనవరి 6: మండలంలోని కాటాపూర్ ప్రాంతంలోని వివిధ గ్రామాలకు నాలుగు రోజుల పాటు మిషన్ భగీరథ నీటి సరఫరా బంద్ అవుతుందని సంబంధిత శాఖ ఏఈ రాంచరణ్ శనివారం తెలిపారు. తాడ్వాయిలో జాతీయ రహదారి వెడల్పు పనులు ముమ్మరంగా సాగుతున్నందున కాటాపూర్ వైపు వెళ్లే పైపులైన్ మరమ్మతులు చేపడుతున్నామని అన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.

నెలాఖరుకు జాతర ఏర్పాట్లు పూర్తిచేయాలి

(5వ పేజీ తరువాయి)

మాట్లాడుతూ భక్తులు వనదేవతలను దర్శించుకునేందుకు క్యూలైన్ల ద్వారా వస్తూ ముడుపులు చెల్లించుకొని మొక్కులు సమర్పించుకుంటారని, ఈ క్రమంలో నిలువెత్తు బంగారం(బెల్లం) మోసుకుంటూ వస్తారని తెలిపారు. భక్తులు సమర్పించే ముడుపులు, బెల్లం గద్దెలపైకి విసరకుండా నేరుగా తల్లులకు చేరేలా కన్వేయర్ బెల్ట్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమర్పించే బెల్లం, ముడుపులు అపవిత్రం కాకుండా భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. భక్తులకు ఆర్వో వాటర్‌ను తాగునీరుగా క్యూలైన్లలో అందించనున్నట్లు తెలిపారు. దీంతో భక్తులకు మొక్కులు నేరుగా సమర్పించుకున్న సంతృప్తి కలుగుతుందని మంత్రి సీతక్క వెల్లడించారు. కార్యక్రమాలలో ఓఎస్డీ అశోక్‌కుమార్, ఏఎస్పీ శిరిశెట్టి సంకీర్త్, ఈవో రాజేంద్రం, డీపీవో వెంకయ్య, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

పార్కింగ్ స్థలాల చదును పనులు ప్రారంభం

మేడారం మహాజాతర అభివృద్ధి పనులలో భాగంగా పార్కింగ్ స్థలాల చదును పనులను పంచాయతీరాజ్ అధికారులు శనివారం ప్రారంభించారు. ఫిబ్రవరి 21 నుంచి నాలుగు రోజులు సమ్మక్క, సారలమ్మల మహా జాతర జరగనున్న నేపథ్యంలో భక్తులు వాహనాలు నిలుపుకునేందుకు 30 ప్రాంతాల్లో 800 ఎకరాలు రెవెన్యూ, 400 ఎకరాలు అటవీ భూమిని కలిపి మొత్తంగా 1200 ఎకరాలలో చదును పనులు ప్రారంభించారు. వనదేవతల దర్శనానికి కోటిన్నర మందికి పైగా భక్తులు వస్తారనే అంచనా ఉండగా లక్షల సంఖ్యలో వాహనాలు నిలిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

రైతుల ఆందోళన

గత జాతరలో పార్కింగ్ చదును పనులు పంట నష్టపోతున్న రైతులకు అప్పగించారని, ఈసారి రైతులకు ఇవ్వకుండా కాంట్రాక్టర్‌లకు ఇవ్వడంతో పంట నష్టపోతున్నామని రైతులు ఎనగంటి భద్రయ్య సిద్దబోయిన శివరాజు, గందం జనార్దన్, సంకె శ్రీనివాస్, రాజు, బాలయ్య, రాజయ్య ఆవేదన వ్యక్తం చేశారు. పంట పొలాలను పార్కింగ్ స్థలాల పేరుతో గుంతలు చేస్తున్నారని అన్నారు. రైతులకు పంట నష్ట పరిహారం ఇవ్వాలని, అదేవిధంగా గుంతలను వారిచే పూడ్పించాలని డిమాండ్ చేశారు. లేకుంటే వాహనాలు పార్కింగ్ చేయకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి : మంత్రి

గోవిందరావుపేట : మేడారం మహాజాతరకు వెళ్లే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అధికారులను ఆదేశించారు. శనివారం మేడారం రహదారుల మరమ్మతు పనులను, పస్రా సమీపంలోని గుండ్లవాగు వంతెన, దయ్యాలవాగు సమీపంలో దెబ్బతిన్న పస్రా-మేడారం రహదారిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మేడారం జాతరకు వచ్చే భక్తులకు రహదారుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. జాతర పనుల విషయంలో ఎవరు పని చేయకపోయినా, నాణ్యత లోపించినా అధికారులను ఇంటికి పంపించడమే జరుగుతుందని హెచ్చరించారు. అనంతరం వెంగళాపూర్-ఎల్బాక సమీపంలోని పార్కింగ్ స్థలాలు, జంపన్నవాగు ఊరట్టం వంతెనను పరిశీలించారు. వరదల సమయంలో జంపన్నవాగు కోతకు గురికావడం వల్ల ఊరట్టం గ్రామానికి ఎక్కువ నష్టం జరిగే అవకాశం ఉన్నందున అడ్డుగా కరకట్ట నిర్మించాలని మంత్రి సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీశ్, ఏటూరునాగారం ఐటీడీఏ పీవో అంకిత్, అదనపు కలెక్టర్లు శ్రీజ, వేణుగోపాల్, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ది గల్లీ బిడ్డల పాలన

▸▸ ప్రజా పాలన ముగింపు గ్రామసభలో మంత్రి సీతక్క

వెంకటాపూర్(రామప్ప), జనవరి 6 : కాంగ్రెస్ పార్టీది గడీల పాలన కాదని, గల్లీ బిడ్డల పాలన అని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. వెంకటాపూర్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో శనివారం ప్రజా పాలన ముగింపు గ్రామసభ జరగగా మంత్రి ముఖ్య అతిథిగా హాజరై ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల మద్దతు చూసి భయపడి దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. అధికారం లేకుండా బీఆర్ఎస్ నాయకులు బతకలేక పోతున్నారని, బీఆర్ఎస్ ఫ్యూడల్ పార్టీ అని, పదేళ్లు దోచుకున్న దోపిడీ దొంగలని ప్రజలు ఓడగొట్టారని అన్నారు.తొందరలోనే బీఆర్ఎస్ పార్టీ దోచుకున్నదంతా బయటకు వస్తుందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రజలందరికీ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఏటూరునాగారం ఐటీడీఏ పీవో అంకిత్, అదనపు కలెక్టర్ శ్రీజ, ఎస్పీ శబరీశ్, డీఎస్పీ రవీందర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చెన్నోజు సూర్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బైరెడ్డి భగవాన్‌రెడ్డి, ఎంపీటీసీలు జంగిలి శ్రీలత, మిల్కూరి ఐలయ్య, ఎన్ఎస్‌యూఐ నాయకులు మామిడిశెట్టి కోటి, గాండ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి : మంత్రి సీతక్క

ములుగు, జనవరి 6 : వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, అన్ని విధాలా ఆదుకుంటామని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) అన్నారు. ములుగులో నిర్మించనున్న నూతన ప్రెస్‌క్లబ్ భవనానికి శనివారం భూమిపూజ చేశారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేసే జర్నలిస్టులకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేస్తామన్నారు. ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామన్నారు. జిల్లా అభివృద్ధిలో జర్నలిస్టులు తమవంతు పాత్ర పోషించాలని, తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటీడీఏ పీవో అంకిత్, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, పీఆర్ ఈఈ అజయ్‌కుమార్, ఏఈ అజిత్, డీపీఆర్‌వో రఫిక్, జర్నలిస్టు సంఘాల నాయకులు ఎమ్డీ.షఫీ అహ్మద్, పిట్టల మధుసూదన్, బేతి సతీష్, భూక్యాసునిల్, బోయినపల్లి శ్రీధర్‌రావు పాల్గొన్నారు.

9న మధ్యాహ్నభోజనం బంద్

మహదేవపూర్, జనవరి 6 : మండలంలోని అన్ని పాఠశాలల్లో ఈ నెల 9న మధ్యాహ్నభోజనాన్ని బంద్ చేస్తున్నట్లు మధ్యాహ్న భోజన వర్కర్ల సంఘం మండల అధ్యక్షుడు సారధి ఒక ప్రకటనలో తెలిపారు. నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతున్నా తమకు ధరలు పెంచకపోవడంతో 9న ఒక రోజు మధ్యాహ్నభోజనాన్ని బంద్ చేస్తున్నట్లు శనివారం ఎంఈవోకు వినతిపత్రాన్ని అందజేసినట్లు చెప్పారు.

రామాలయంలో తులసి అర్చన పూజ

మహదేవపూర్, జనవరి 6 : మండలంలోని శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయ అనుబంధ ఆలయమైన రామాలయంలో శనివారం ఉదయం తులసి అర్చన పూజ నిర్వహించారు. వైష్ణవ సంప్రదాయంలోని పవిత్ర ధనుర్మాసం కావడంతో తులసి అర్చన పూజ చేశారు. కార్యక్రమంలో అర్చకులు ఆరుట్ల రామాచారి, వైకుంఠపాండా, ముఖ్య అర్చకులు ఫణీంద్రశర్మ, శరత్‌చంద్ర, ఆలయ సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, సర్పంచ్ వసంత, తులసి దళాల దాత చల్ల తిరుపతయ్య భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి క్రీడా పోటీలు

చిట్యాల, జనవరి 6 : స్వామి వివేకానంద, చంద్రబోస్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఏబీవీపీ ఆధ్వర్యంలో చిట్యాల మండల కేంద్రంలో మూడు రోజులుగా నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. పాఠశాల స్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడల్లో బాలురు, బాలికల విభాగంలో ఎంజేపీ మొగుళ్లపల్లి, చిట్యాల గురుకుల పాఠశాలలు ప్రథమ స్థానంలో నిలిచాయి. కళాశాల స్థాయి పోటీల్లో కబడ్డీలో గాంధీ కాలేజి భూపాలపల్లి, కేజీబీవీ కొర్కిశాల, ఖోఖోలో ఎంజేపీ మొగుళ్లపల్లి, మోడల్ స్కూల్ చిట్యాల, వాలీబాల్‌లో ఎంజేపీ మొగుళ్లపల్లి, గురుకుల కళాశాల చిట్యాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచినట్లు క్రీడా నిర్వాహకుడు వేల్పుల రాజ్‌కుమార్ తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబర్చిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

ఉద్యమకారుల గుర్తింపునకు కమిటీ వేయాలి

మల్హర్, జనవరి 6 : తెలంగాణ ఉద్యమకారులను గుర్తించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం(టీయూఎఫ్) రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పోతు జ్యోతిరెడ్డి అన్నారు. శనివారం తాడిచర్లలో నిర్వహించిన ఉద్యమకారుల సదస్సులో పాల్గొని మాట్లాడారు. గత బీఆర్ఎస్ పభుత్వం ఉద్యమకారులను విస్మరించిందని అన్నారు. ఉద్యమకారులను గుర్తించిన కాంగ్రెస్ పార్టీకి, సీఎం రేవంత్‌రెడ్డికి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఉద్యమకారులను గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు యాదండ్ల గట్టయ్య, పోలోజు సత్యనారాయణ, బోయిని రాజయ్య, ఈశ్వరమ్మ,సమ్మక్క, ముడితనపెల్లి ప్రభాకర్, చొప్పరి రాజు, అక్కపాక సమ్మయ్య బూడిద సతీష్, మీనుగు నాగేష్, గణేష్, చాంద్ పాషా, యశోద, భీమయ్య, కిష్టయ్య, వెంకటస్వామి, సబావత్ నాగరాజు, సది, ఓదెలు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన తహసీల్దార్‌గా మురళీధర్‌రావు

గణపురం, జనవరి 6: మండల నూతన తహసీల్దార్‌గా ఆర్.మురళీధర్‌రావు కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఉత్తర్వుల మేరకు కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తున్న మురళీధర్‌రావును గణపురం మండలానికి బదిలీ చేశారు. దీంతో శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అయితే ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సాయిని సతీష్‌ను కలెక్టరేట్‌కు బదిలీ చేశారు.

ఏటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రి

వెంకటాపురం(నూగూరు), జనవరి 6 : ములుగులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క శనివారం ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్(ఏటీఎఫ్) నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోకాళ్ల శ్రీనివాసరావు మాటాడుతూ ఏజెన్సీలో విద్యారంగ సమస్యలను పరిష్కరించేలా కృషి చేయాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కబ్బాకుల రవి, కుర్సం అంజయ్య, రాష్ట్ర కార్యదర్శులు కుంజా కృష్ణ, ఉండం నాగేందర్‌రావు, నాయకులు రామచంద్రు, కోరం సంతోష్, వాసం నాగేశ్వర్‌రావు, బొగ్గుల లక్ష్మయ్య, చాపల రమేష్‌బాబు, భీక్షం, లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన శరణు ఘోష

▸▸ ఇరుముడులతో యాత్రకు తరలిన స్వాములు

ఏటూరునాగారం, జనవరి 6 : మండల కేంద్రంలోని శివాలయం నుంచి శనివారం పలువురు అయ్యప్ప స్వామి మాలధారులు శబరిమల, భద్రాచలం, శ్రీశైలం, తిరుపతి, ద్వారకపూడి, హరిహర క్షేత్రం, భద్రకాళి యాత్రకు తరలివెళ్లారు. ఆలయంలో అయ్యప్ప భక్తులకు గురుస్వాములు ఇరుముడులు కట్టి వారిని సాగనంపారు. ఆలయ ఆవరణలో దీక్షాపరులు, వారి కుటుంబ సభ్యులు, బంధువులతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అయ్యప్ప శరణు ఘోష మధ్య మాలధారులు ఆలయం నుంచి బ్రహ్మంగారి ఆలయం, రామాలయం మీదిగా బొడ్రాయి,సాయిబాబా ఆలయంనుంచి బస్టాండ్ వరకు పాద యాత్రగా వెళ్లారు. అక్కడి నుంచి వాహనాల్లో బయల్దేరారు. ఇందులో గురుస్వాములు చింతల విజయ్, కునారపు సత్యనారాయణ, బట్ట ఉపేందర్, కునారపు రాములు, రమేష్, స్వాములు తరలివెళ్లారు.

లక్ష దాటిన ప్రజా పాలన దరఖాస్తులు

▸▸ ములుగు జిల్లాలో 1,09,669 అప్లికేషన్‌లు

ములుగు, జనవరి 6 : ప్రజా పాలన గ్రామ సభలకు ములుగు జిల్లాలో అనూహ్య స్పందన లభించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన అభయహస్తం ఐదు గ్యారెంటీ స్కీమ్‌ల లబ్ధిదారుల ఎంపిక కోసం డిసెంబరు 28 నుంచి ఊరూరా గ్రామ సభలు ఏర్పాటు చేశారు. అధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. 6వ తేదీ చివరి గడువు కాగా 174 గ్రామ పంచాయతీల నుంచి మొత్తం 1,09,669 మంది వివిధ పథకాల కోసం అర్జీ పెట్టుకున్నారు. వీటిలో ఐదు గ్యారెంటీ స్కీమ్‌లకు 97,511 మంది, వేరే పథకాల కోసం 12,158 దరఖాస్తు చేసుకున్నారు. చివరి రోజున 5,857 దరఖాస్తులు వచ్చాయి.

నిధుల మంజూరుపై రైతుల హర్షం

మల్హర్, జవనరి 6: మండల కేంద్రమైన తాడిచర్ల నుంచి ఓదెలకు వెళ్లే మార్గంలోని మోట ఒర్రెపై రోడ్డామ్ నిర్మాణానికి రూ.40 లక్షల నిధులు మంజూరు చేయడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం మండల కేంద్రమైన తాడిచర్లలో ఎంపీపీ చింతలపల్లి మల్హర్‌రావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ ఒర్రెలో ఏడాది పొడవునా నీరు ఉండటం వల్ల రైతులు ఒర్రె దాటి వెళ్లడానికి అనేక ఇబ్బందులు పడేవారని తెలిపారు. రైతులు పొలాల వద్దకు మందు బస్తాలు, మోటార్లను బయటకు తీసుకొని రావడానికి ఇబ్బందులు పడాల్సి వచ్చేదన్నారు. మంత్రిగా ప్రమాణస్వీకారం చేసి మంథనికి వచ్చిన సందర్భంలో సమస్యను తెలపగానే నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. డీఎంఎఫ్‌టీ ద్వారా రూ.40 లక్షలతో ఈ రోడ్డామ్‌ను త్వరితగతిన నిర్మించి రైతుల కష్టాలు తీర్చనున్నట్లు ఎంపీపీ తెలిపారు. సమావేశంలో నాయకులు కేసారపు చంద్రయ్య, కుంట సదానందం, బొబ్బిలి రాజు, పుప్పాల రాజు, వెంకటేశ్వర్‌రావు, బండి స్వామి, రాజసమ్మయ్య, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైభవంగా నగర సంకీర్తన

మంగపేట, జనవరి 6: మండలంలోని బోరునర్సాపురంలో వెలిసిన శ్రీ రామాంజనేయ స్వామి దేవాలయంలో గత నెల 17 నుంచి ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా శనివారం బోరునర్సాపురం, మంగపేటలో గోదాదేవి, శ్రీ సీతారామచంద్రస్వామి, ఆంజనేయుడి ఉత్సవ విగ్రహాలతో నగర సంకీర్తన కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో భక్తులు సంకీర్తనకు ఎదురేగి బిందెలతో గోదావరి జలాలతో ఆరబోసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణం వరకు ఉత్సవ విగ్రహాలు, చిత్రపటాలను తీసుకెళ్లి ప్రత్యేక పూజలను అర్చకులు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు, పుర ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి

▸▸ జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని

ములుగు కలెక్టరేట్, జనవరి 6: జిల్లాలోని ఏడు పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభమయ్యే వృత్తి విద్యా కోర్సులను విద్యార్థినీ, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి జి.పాణిని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థుల్లో దాగివున్న వృత్తి పరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి, భవిష్యత్‌లో వారు ఏదైనా ఒక వృత్తిలో స్థిరపడడానికి ఈ శిక్షణ ఉపయుక్తంగా ఉంటుందని అన్నారు. జిల్లాలోని ములుగు మండలం బండారుపల్లి ఆదర్శ పాఠశాల, వెంకటాపూర్ మండలం జవహర్‌నగర్ ఆదర్శ పాఠశాల, గోవిందరావుపేట మండలంలోని చల్వాయి ఆదర్శ పాఠశాల, ఏటూరునాగారంలోని ఉన్నత పాఠశాల, వెంకటాపురం ఉన్నత పాఠశాల, ఏటూరునాగారం కేజీబీవీ, బండారుపల్లి గురుకుల పాఠశాలల్లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, బ్యూటీ అండ్ వెల్‌నెస్, టూరిజం అండ్ హాస్పిటాలిటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ హార్డ్వర్డ్, హెల్త్‌కేర్ అండ్ ప్లంబింగ్, డొమెస్టిక్ డాటాఎంట్రీ ఆపరేటర్ వంటి వృత్తి విద్యా కోర్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వృత్తివిద్య కోఆర్డినేటర్ బద్దం సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ 9, 10, 11, 12 తరగతుల విద్యార్థులకు వృత్తి విద్యా కోర్సులు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఆయా పాఠశాలల్లో బోధకులు సిలబస్‌ను అనుసరించి సకాలంలో పూర్తిచేసి విద్యార్థులను ఆయా రంగాల్లో నిష్ణాతులుగా తీర్చిదిద్దాలని అన్నారు.



భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో ముగ్గులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



ముగ్గులను పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత



ముగ్గును పరిశీలిస్తున్న అదనపు ఎస్పీ నరేష్‌కుమార్



పట్టణంలోని అంబేద్కర్ స్టేడియంలో ముగ్గులు వేస్తున్న మహిళలు

